సాక్షి
నిర్మల్
మంగళవారం : 25 : జూలై : 2023



‘లక్ష’ణమైన మాస్టారు

8లో▸

ఆయనో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు.. విద్యార్థులకు సులభ పద్ధతిలో పాఠాలు బోధించనిదే తనకు సంతృప్తి ఉండదంటారు. బోధనాంశాలను వీడియో తీస్తున్నారు. వాటిని యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

28న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఈనెల 28న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు. ప్రథమ సంవత్సరంలో డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో మిగిలిన సీట్లకు స్పాట్ ప్రక్రియ ఉంటుందని వివరించారు. విద్యార్థులు ఈనెల 25 నుంచి 27 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాలిసెట్‌లో అర్హత పొందిన వారు, పొందని వారు లేదా పదో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

గరిష్టం/కనిష్టం
28.6 /24.2

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాలు, అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షాలు కురుస్తాయి.

న్యూస్‌రీల్

రక్తహీనత రహిత జిల్లాకు సహకరించాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

ఖానాపూర్: రక్తహీనతరహిత జిల్లాగా చేయడానికి అనీమియా సే నిర్మల్ ముక్త్ అనే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్ కోరారు. మండలంలోని సత్తనపల్లి రైతువేదికలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గర్భిణులు రక్తహీనతతో నెలలు నిండకుండానే ప్రసవించడం, పుట్టిన పిల్లల బరువు తక్కువగా ఉండడం, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. గర్భిణులు ఆహారంలో ఆకు కూరలు, కాయగూరలు, బెల్లం, పల్లీలు, క్యారెట్, బీట్‌రూట్, తృణధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కిషోర బాలికల వయసు నుంచే మహిళల్లో రక్తహీనతపై ప్రత్యేక దృష్టిపెట్టి సరైన ఆహారపదార్థాలు, అవసరమైన మందులు వేసుకోవాలన్నారు. ప్రతీ గర్భిణి రక్తంలో కనీసం 11 గ్రాముల హిమోగ్లోబిన్ ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సీర్ల లక్ష్మీ, కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ నిఖిలరాణి, వైద్యులు శ్రీనివాస్, స్రవంతి, సీహెచ్‌వో మీరాబాయి, హెచ్‌ఈ జయలలిత పాల్గొన్నారు.

‘కడెం’కు ఇన్‌ఫ్లో



కడెం: కడెం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం ఉదయం 4,519 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో.. అధికారులు రెండు గేట్ల ద్వారా 10,339 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్‌పూర్తి నీటిమట్టం 700(7.603టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 690.700(5.428టీఎంసీ) అడుగుల వద్ద స్థిరంగా ఉంచారు. వరద గేట్లకు మరమ్మతులను ఇన్‌చార్జి ఈఈ విఠల్ పరిశీలించారు.


‘సదర్మాట్’కు తగ్గిన వరద

ఖానాపూర్: మండలంలోని మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్ ఆనకట్టకు సోమవారం వరద తగ్గింది. గరిష్ట నీటిమట్టం 7.6 ఫీట్లు కాగా, ప్రస్తుతం 8.2 ఫీట్లలో నీరు ఉంది. 5,129 క్యూసెక్కుల నీరు గోదావరిలోకి వెళ్తోందని ఏఈఈ ఉదయ్ తెలిపారు.

‘స్వర్ణ’ ఒక గేటు ఎత్తివేత

సారంగాపూర్: ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షానికి స్వర్ణ ప్రాజెక్టులోకి వరద పోటెత్తడంతో అప్రమత్తమైన అధికారులు సోమవారం తెల్లవారుజామున ఒక గేటు ఎత్తి స్వర్ణ నదిలోకి నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,183 అడుగులు(1.484) టీఎంసీలు కాగా ఒక్కసారిగా వెయ్యి క్యూసెక్కుల వరద నీరు రావడంతో అంతేమొత్తంలో నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 1,179.5 అడుగుల వద్ద స్థిరంగా ఉంచారు.

ఆర్టీసీ ఆర్‌ఎంగా సోలమన్



సోలమన్

ఆదిలాబాద్: ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌గా పి.సోలమన్ సోమవారం ఆదిలాబాద్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటివరకు హైదరాబాద్‌లో చీఫ్‌ట్రాఫిక్ మేనేజర్ (ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్)గా విధులు నిర్వహించగా, ఆదిలాబాద్ ఆర్‌ఎంగా బదిలీ చేస్తూ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఇక్కడ ఆర్‌ఎంగా పనిచేసిన జానీరెడ్డి నిజామాబాద్‌కు బదిలీపై వెళ్లారు.

ఉమ్మడి జిల్లాకు కొత్త అదనపు కలెక్టర్లు

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పనిచేస్తున్న రెవెన్యూ అడిషనల్ కలెక్టర్లు బదిలీ అయ్యారు. నాలుగు జిల్లాలకు కొత్త అధికారులు రానున్నారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పనిచేస్తున్న నలుగురు అధికారులను అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)గా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదిలాబాద్ అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) ఎన్.నటరాజ్‌ను ఖమ్మం జిల్లాకు అదే హోదాలో బదిలీ చేశారు. ఆయన స్థానంలో బేతి రాజేశంను నియమించారు. పోస్టింగ్ కోసం వేచి చూస్తున్న ఎస్.మోతిలాల్‌ను మంచిర్యాల అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)గా, భద్రాచలం జిల్లా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎల్. కిశోర్‌కుమార్‌ను నిర్మల్ అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)గా నియమించారు. మహబూబ్‌నగర్ జిల్లా ఇరిగేషన్ శాఖలో ఎస్‌డీసీగా పనిచేస్తున్న డి.వేణును కుమురంభీం జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

క్రమబద్ధీకరణ పంచాయతీ



నిరసన తెలియజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు (ఫైల్)

- జేపీఎస్‌ల పర్మినెంట్‌కు నిబంధనలు
- పనితీరు, నాలుగేళ్ల సర్వీస్ తప్పనిసరి
- అభివృద్ధి పనుల ఆధారంగా మార్కుల కేటాయింపు
- పనితీరును లెక్కగట్టేందుకు ప్రత్యేక కమిటీ
- జిల్లాలో ఇంకా ప్రారంభంకాని ప్రక్రియ

నిర్మల్‌చైన్‌గేట్: రెగ్యులరైజ్ చేస్తామని జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు(జేపీఎస్) ఆశ పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు నిబంధనల పేరుతో ఆందోళనకు గురిచేస్తోంది. నాలుగేళ్ల సర్వీసు, పనితీరు ఆధారంగా పర్మినెంట్ చేస్తామని తాజాగా సర్కారు కిరికిరి పెట్టిందని జేపీఎస్‌లు వాపోతున్నారు.

మూడేళ్ల ప్రాతిపదికన నియామకం..

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రాష్ట్ర ప్రభుత్వం 2019, ఏప్రిల్ 12న నియమించింది. మొదట మూడేళ్ల కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాల్లో నియమించుకోగా, పని ఒత్తిడి కారణంగా చాలా మంది మధ్యలోనే మానేశారు. మానేసినవారి స్థానంలో నాలుగైదు విడతలుగా కొత్తవారిని తీసుకున్నారు. మూడేళ్ల సర్వీస్ పూర్తయిన తర్వాత రెగ్యులరైజ్ చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. గతేడాది ప్రభుత్వం జీవో–26 ద్వారా ప్రొవిజన్ కాలాన్ని మరో ఏడాది పెంచగా, ఈ ఏడాది ఏప్రిల్ వరకు ముగిసిపోయింది. దీంతో తమను రెగ్యులరైజ్ చేయాలని గత ఏప్రిల్ 28 నుంచి 16 రోజులపాటు జేపీఎస్‌లు సమ్మెకు దిగారు. సమ్మె విరమించకపోతే ఉద్యోగాల్లోంచి తీసేస్తామని ప్రభుత్వం హెచ్చరించడంతో మే, 13న తిరిగి విధుల్లో చేరారు. ఆ తర్వాత జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో ఆశలు రేకెత్తాయి. తాజాగా ఎనిమిది మార్గదర్శకాలు విడుదల చేసి, ఇందులో వారి పనితీరు ఆధారంగా మార్కులు ఇచ్చి, పర్మినెంట్ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది.

త్రిసభ్య కమిటీ ఏర్పాటు...

నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పనితీరే ప్రమాణికంగా క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. గ్రామాల్లో అభివృద్ధి పనుల మూల్యాంకనానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అధ్యక్షతన ఎస్పీ లేదా డీఎస్పీ, జిల్లా అటవీ అధికారి(డీఎఫ్)తో కూడిన త్రిసభ్య కమిటీని నియమించింది. ఈకమిటీ గ్రామాల్లో రోడ్లు, మురుగు కాల్వల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, కంపోస్టు ఎరువుల తయారీ, పన్ను వసూళ్లు, మొక్కల సంరక్షణ, చెత్త డంపింగ్ యార్డు నిర్వహణ, ట్రాక్టర్ ఈఎంఐలు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు వంటి పనులను పరిశీలించి మార్కులు కేటాయిస్తుంది. వీటిని ఎవాల్యుయేషన్ యాప్‌లో అప్లోడ్ చేస్తారు. జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియను నెలరోజుల్లో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకున్నారు. కమిటీలో ముఖ్య సభ్యులైన అదనపు కలెక్టర్ బదిలీ కావడంతో జిల్లాలో ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

నాలుగేళ్లు సర్వీస్ పూర్తి చేసుకున్నవారు 220 మంది..

జిల్లాలో రెగ్యులర్ 65, జూనియర్ 316, ఔట్ సోర్సింగ్ 11 మంది పంచాయతీ కార్యదర్శులు కలిపి మొత్తం 392 మంది పని చేస్తున్నారు. రాత పరీక్ష ద్వారా 2019లో ఏప్రిల్ 12న జేపీఎస్‌లు విధుల్లో చేరారు. వీరిలో కొందరికి ఇతర ఉద్యోగాలు రావడంతో 4 పోస్టులు ఖాళీ అయ్యాయి. వీటిని మెరిట్ ప్రాతిపదికన భర్తీచేస్తూ వచ్చారు. నాలుగు నెలల వ్యవధి తరువాత మరి కొంత మంది విధుల్లో చేరారు. గతేడాది నుంచి ఔట్ సోర్సింగ్ విధానంలో ఖాళీలను భర్తీ చేశారు. నాలుగేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు 220 మంది ఉన్నారని జిల్లా అధికారి తెలిపారు.

జిల్లా వివరాలు...

మొత్తం మండలాలు : 18
మొత్తం గ్రామపంచాయతీలు : 396
ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు : 392
ఖాళీగా ఉన్న పంచాయతీ కార్యదర్శుల పోస్టులు : 04
రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు : 65
జూనియర్ పంచాయతీ కార్యదర్శులు : 316
ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు : 11

మార్కులు ఇలా...

- రోడ్లు, డ్రైనేజీలు శుభ్రం, దోమల నివారణ చర్యలు, పంచాయతీ రికార్డులు, డంపింగ్ యార్డు, వర్మీ కంపోస్టు తయారీ, వైకుంఠ ధామం నిర్వహణ, పన్ను వసూలు, మొక్కల పెంపకం, క్రీడా ప్రాంగణ నిర్వహణ పక్కాగా చేపడితే 35 మార్కులు కేటాయిస్తుంది.
- వందశాతం ఇంటి పన్నుకు 10 మార్కులు.
- నర్సరీ, మొక్కల పెంపకం, పంపిణీకి 10 మార్కులు.
- రోడ్ల పక్కన, ఇళ్లలో, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటడం, తోటల పెంపకానికి 10 మార్కులు.
- విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐ చెల్లింపునకు 10 మార్కులు.
- పంచాయతీ నిధుల నుంచి 10 శాతం గ్రీన్ బడ్జెట్‌కు కేటాయిస్తే 5 మార్కులు.
- తడి, పొడి చెత్త సేకరణకు 15 మార్కులు.
- జనన, మరణాల రికార్డుల నిర్వహణకు 5 మార్కులు కలిపి మొత్తం 100 మార్కులను కేటాయించింది.

మార్గదర్శకాల ప్రకారం..



జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 2019 నుంచి జేపీఎస్ వ్యవస్థ కొనసాగుతోంది. ప్రస్తుతం 316 మంది జేపీఎస్‌లు పనిచేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకుంటాం.
– శ్రీలత, డీపీవో

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ఆయా శాఖలకు సంబంధించి ప్రజావాణిలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలు స్వీకరించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను దరఖాస్తు రూపంలో విన్నవించారు. కొన్నింటిని తక్షణమే పరిష్కరించారు. పోడు భూములు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఆసరా పెన్షన్, భూసమస్యలు, ధరణి పెండింగ్ దరఖాస్తులపై తక్షణమే స్పందించి అర్జీదారులకు న్యాయం చేయాలని సూచించారు. తహసీల్దార్లు వారిపరిధిలోని మండలాల్లో జరిగే అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటించాలని, ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందించారు. 2022–23 అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సీఎం చంద్రశేఖర్‌రావు, ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఉద్యోగుల క్రమబద్ధీకరణ 2023, ఏప్రిల్ నుంచి ప్రారంభమవుతుందని ప్రకటించారని తెలిపారు. సమగ్ర శిక్షలో వివిధ హోదాల్లో 21 వేలకుపైగా ఉద్యోగులు 15 ఏళ్లుగా పనిచేస్తున్నామన్నారు. విద్యాశాఖలో కీలకంగా ఉంటూ రాష్ట్రంలో విద్యాభివద్ధికు కృషి చేస్తున్నామని తెలిపారు. రోస్టర్, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికై క్రమబద్ధీకరణకు అర్హత కలిగి ఉన్నామన్నారు. ఈమేరకు తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని కోరారు.

ఇక ఇంగ్లిష్ ప్రాక్టికల్స్..!



ప్రయోగాలు చేస్తున్న ఇంటర్ విద్యార్థులు (ఫైల్)

- ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం
- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు..
- ప్రాక్టికల్స్‌కు ప్రత్యేకంగా 20 మార్కులు
- కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచేందుకే..
- నైపుణ్యం పెరుగుతుందంటున్న అధ్యాపకులు

నిర్మల్ ఖిల్లా: పాఠశాల విద్య అనంతరం అత్యంత కీలకమైన దశ ఇంటర్మీడియెట్. ఈదశలో భాషాపరిజ్ఞానం పెంపొందితే అన్నిరకాల పోటీ పరీక్షలను విద్యార్థులు విజయవంతంగా ఎదుర్కోగలుగుతారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించడంలో భాగంగా ఆంగ్లభాష పరిజ్ఞానం అత్యంత కీలకం. ప్రస్తుతం ఏ ఉద్యోగం పొందాలన్నా.. ఏ పోటీ పరీక్ష రాయాలన్నా ఆంగ్లభాష కీలకమవుతోంది. ఈ తరుణంలో ఇంటర్‌లోనే ఆంగ్లంపై విద్యార్థులు పట్టు సాధించేలా ఇంటర్‌బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విద్యాసంవత్సరం నుంచే ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ నిర్వహించాలని సంకల్పించింది. ప్రస్తుతం ఇంటర్‌లో బోటనీ, జువాలజీ, ఫిజిక్స్ కెమిస్ట్రీ ప్రాక్టికల్స్ మాత్రమే ఉండగా, ఇక ఇంగ్లిష్ భాషకు సైతం ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఇంటర్ అధికారులకు ఆదేశాలు అందాయి.

ప్రాక్టికల్ మార్కులు ఇలా..

ఇంటర్మీడియెట్ స్థాయిలో ఇంగ్లిష్ సబ్జెక్టుకు ప్రాక్టికల్స్‌కు 20 మార్కులు కేటాయించారు. ఇందులో నాలుగు విభాగాలు ఉంటాయి. ఒక్కో విభాగానికి నాలుగు మార్కులు కేటాయించారు. అదేవిధంగా రికార్డుకు మరో నాలుగు మార్కులు కేటాయించారు. వీటిలో నాలుగు అంశాలు ఉంటాయి. కమ్యూనికేటివ్ ఫంక్షన్‌కు నాలుగు మార్కులు, జస్ట్ ఏ మినిట్(జామ్)కు నాలుగు మార్కులు, రోల్‌ప్లే(పాత్ర పోషణ)కు నాలుగు మార్కులు, లిజనింగ్ కాంప్రిహెన్షన్‌కు నాలుగు మార్కులు, రికార్డు పుస్తకానికి నాలుగు మార్కులు కేటాయించారు. ఈ 20 మార్కుల్లో విద్యార్థి కనీసం ఏడు మార్కులు సాధించాల్సి ఉంటుంది. థియరీ పరీక్షకు 80 మార్కులు, ప్రాక్టికల్ మార్కులు 20 కలుపుకుని ఇంగ్లిష్ సబ్జెక్టుకు మొత్తం 100 మార్కులు ఉండనున్నాయి.

ఆంగ్లానికి ప్రాధాన్యంతోనే...

ప్రస్తుతం ఉన్న ఆంగ్లభాషకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకునే ఈ సబ్జెక్టుకు ప్రాక్టికల్స్‌ను ప్రవేశపెట్టినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇంగ్లిష్ భాషపై సరైన పట్టు లేకపోవడం ఉన్నతస్థాయిలో అన్ని ఆంగ్ల మాధ్యమంలోనే ఉండడంతో ఆంగ్లంపై విద్యార్థులు భయం ఏర్పరచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆంగ్ల భాషకు ప్రాక్టికల్స్ ప్రవేశపెట్టనుండడంతో రోజువారీ సబ్జెక్టు పీరియడ్‌లకు అదనంగా, వారానికి గంటపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించే విధంగా చదవడం, రాయడం, మాట్లాడడం సాఫ్ట్‌స్కిల్స్ వంటి నైపుణ్యాలు విద్యార్థుల్లో పెంపొందించనున్నారు. ఈ మేరకు బోధన అంశాలపై ఇంగ్లిష్ బోధించే అధ్యాపకులకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నారు.

ప్రాక్టికల్ మార్కుల వివరాలు

అంశం	నిర్వహణ విధానం	మార్కులు
కమ్యూకేటీవ్ ఫంక్షనింగ్	మౌఖిక	4
జస్ట్ ఏ మినిట్(జామ్)	మౌఖిక	4
పాత్రపోషణ(రోల్ ప్లే)	మౌఖిక	4
లిజనింగ్‌కాంప్రిహెన్షన్	రాత	4
ప్రాక్టికల్ రికార్డ్	రాత	4

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపు కోసమే..




ఇంగ్లిష్ భాషకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్లాలనుకునే వారికి ఇంగ్లిష్ భాష కీలకం. ఈ భాషలో విద్యార్థులు పట్టు సాధించే విధంగా ఇంటర్ స్థాయినుండే ఇంగ్లిష్ భాషలో నైపుణ్యాలు పెంపొందించేందుకు ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది.
– కె.నవీన్, జూనియర్ అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, లోకేశ్వరం

ఆంగ్లంపై పట్టు పెరుగుతుంది..




ఇంటర్ విద్యార్థులకు ఆంగ్లభాష నైపుణ్యాలు పెంపొందించే విధంగా ఇంటర్ బోర్డు ప్రాక్టికల్స్ ప్రవేశపెట్టింది. ఈ ఏడాది మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఉంటాయి. విద్యార్థులకు ఆంగ్లపై పట్టు పెరుగుతుంది.
– జాదవ్ పరుశురాం, డీఐఈవో

భయం పోతుంది




చిన్నప్పటి నుంచి ఇంగ్లిష్‌ను థియరీ రూపంలోనే చదివాం. ఇప్పుడు ప్రాక్టికల్ ఉంటుందని మా లెక్చరర్లు చెప్పారు. ఇందుకోసం ఇప్పటినుంచే ప్రతీరోజు పీరియడ్‌లో మాట్లాడడం ప్రాక్టీస్ చేయిస్తున్నారు. దీనివల్ల ఇంగ్లిష్ అంటే మాకు కొద్దికొద్దిగా భయం పోతుంది.
– శ్రీకాంత్, ఇంటర్ విద్యార్థి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, దిలావర్‌పూర్

ఒక్కోరోజు ఒక్కోఅంశంపై..



ఇంగ్లిష్ అంటేనే ఆచరణలో పెట్టడం.. దినచర్యలో భాగంగా తోటి మిత్రులతో మాట్లాడటం కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయని మా సార్లు చెబుతున్నారు. ఒక్కోఅంశంపై ఒక్కోరోజు కేటాయించిన పీరియడ్‌లో వ్యక్తిగతంగా మాట్లాడిస్తున్నారు.
– శ్రీదేవి, ఇంటర్ విద్యార్థిని, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, లెఫ్ట్‌పోచంపాడ్

మంచి నిర్ణయం..



ఇంటర్‌లో ఇంగ్లిష్ ప్రాక్టికల్ నిర్వహించడం ద్వారా పిల్లల్లో సాఫ్ట్ స్కిల్స్ పెరుగుతాయి. ప్రస్తుతం అన్నిరకాల పోటీ పరీక్షలు ఇంగ్లిష్‌కే ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇంగ్లిష్‌లో ప్రాక్టికల్ నిర్వహించడం ద్వారా ఇంగ్లిష్ భాషపై అంతర్గతంగా ఉన్న భయం తగ్గిపోతుంది. సబ్జెక్టుపై పట్టు సాధిస్తారు.
– బొమ్మెర గోపాల్, విద్యార్థి తండ్రి, దిలావర్‌పూర్

కృత్యాధారంగా బోధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్ రెడ్డి

నిర్మల్ రూరల్: విద్యార్థుల్లో కనీస భాషా సామర్థ్యాల సాధనకు ఉపాధ్యాయులు కృత్యాల ద్వారా పాఠాలు బోధించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో ప్రాథమిక ఉపాధ్యాయులకు తొలిమెట్టు శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో రవీందర్‌రెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ శిక్షణ శిబిరం మూడు రోజులు కొనసాగుతుందన్నారు. గతేడాది ప్రారంభించిన తొలిమెట్టు రెండో దశను ఈ విద్యా సంవత్సరంలో నిర్వహిస్తామన్నారు. ఈమేరకు ఒకటి నుంచి ఐదు తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులకు 3 రోజుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు ఆంగ్ల మాధ్యమంలోకి మారినందున, ప్రతీ విద్యార్థి ఆంగ్లంలో మాట్లాడేలా కృషి చేయాలన్నారు. విద్యార్థులను పోటీ పరీక్షలవైపు మళ్లించాలని సూచించారు. పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ప్రతీ పాఠశాలలో రీడింగ్ కార్నర్‌లు, లైబ్రరీ పీరియడ్‌లు ఏర్పాటు చేశామని వీటిని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు పఠనంపై ఆసక్తి కలిగించాలన్నారు. ప్రతీనెల తల్లి దండ్రుల సమావేశాలు నిర్వహిస్తూ, వారిని పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములను చేయాలని సూచించారు. సమావేశంలో సెక్టోరియల్ అధికారులు నర్సయ్య, ప్రవీణ్‌కుమార్, లింబాద్రి, ఎంఈవో శంకర్, డీఎస్‌వో వినోద్‌కుమార్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రమణారావు, స్టేట్ రిసోర్స్ గ్రూప్ మెంబర్ నారాయణవర్మ, స్టేట్ రిసోర్స్ పర్సన్స్ వనజ, సంగీత, సరిత, వెంకట్రాజం, సాజిద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీలు నెరవేరిస్తే పోటీ నుంచి తప్పకుంటా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

- మంత్రి ఐకేరెడ్డికి మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సవాల్
- ప్రధానమంత్రి ఆవాస్ యోజన అమలు చేయాలని డిమాండ్
- బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మహాధర్నా

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరిస్తే వచ్చే ఎన్నికల్లో తాను పోటీ లేకుండా చూస్తామని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని పాత కలెక్టరేట్ ఎదుట సోమవారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ప్రతీ పేదవాడికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి.. ఎవరికీ ఇవ్వకుండా మోసం చేశారన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి 1,50,000 దరఖాస్తులకు కేవలం 10 వేల ఇళ్లు కూడా కట్టించలేకపోయారని విమర్శించారు. కట్టించిన ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. తన పనివాళ్ల కోసం 50 ఇళ్లు పంపిణీ చేశాడని ఆరోపించారు. మంత్రి చెప్పే మోసపూరిత మాటలు విని మళ్లీ మోసపోవడానికి నిర్మల్ ప్రజలు సిద్ధంగా లేరన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మనోహర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు అయ్యన్న గారి భూమయ్య, రావుల రామ్‌నాథ్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లికార్జునరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, సామా రాజేశ్వర్‌రెడ్డి, అలివేలు మంగ, కోరిపల్లి శ్రావణ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అరవింద్, రాచకొండ సాగర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగుల కోసం ప్రత్యేక ఓపీ



ఓపీని ప్రారంభిస్తున్న జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఓపీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. సోమవారం ప్రత్యేక ఓపీని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రోగులను వైద్యులు పరీక్షించి చికిత్స అందించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ రిమ్స్‌కు నిత్యం వందలాది రోగులు వస్తుంటారని, దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా ఓపీ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ఓపీలో రోగుల సంఖ్య పెరిగిందని తెలిపారు. ఆయన వెంట సూపరింటిండెంట్ అశోక్, ఆర్ఎంఓ చందు, వైద్యులు తిప్పేస్వామి, శ్యామ్ తదితరులు ఉన్నారు.

జింక అప్పగింత



అధికారులకు జింక అప్పగిస్తున్న రమేశ్

లోకేశ్వరం: భారీ వర్షాలకు గోదావరి నది వరద పోటెత్తడంతో జింకపిల్ల మండలంలోని పంచగుడిలో ఈదుల చెరువు కిందికి వచ్చింది. సోమవారం జింకను కుక్కలు వెంబడించడంతో పొలం ఒడ్డుకింద పడి ఉంది. ధర్మోర గ్రామానికి చెందిన మెకానిక్ గడ్వాంద రమేశ్ అటుగుండా వెళ్తుండగా జింకను గమనించి పంచగుడికి తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న నిర్మల్ బీట్ అధికారులు అనుపమ, వెన్నెల అక్కడికి చేరుకోగా, జింకను అప్పగించారు. సర్పంచ్ ఎల్లన్న, వైస్ ఎంపీపీ మామిడి నారాయణరెడ్డి, నాయకులు పోట్‌పల్లి సాయన్న, సతీశ్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ ఉన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

భైంసాటౌన్: పట్టణంలోని పిప్రికాలనీకి చెందిన వాగ్మారే సోని అనే వివాహిత సోమవారం స్థానిక గడ్డెన్నవాగు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యకు యత్నించింది. దీంతో అక్కడే చేపలు పడుతున్న కుంట ప్రాంతానికి చెందిన షేక్ అఫ్రోజ్, నజీమ్, ముజాహిద్‌లు గమనించి వెంటనే నీటిలో దూకి ఆమెను ఒడ్డుకు చేర్చారు. అంబులెన్స్‌లో భైంసా ఏరియాస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పేర్కొన్నారు. సోని భర్త రవికుమార్ తనను, ఇద్దరు పిల్లలను వదిలి హైదరాబాద్ వెళ్లిపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించి ఉంటుందని బంధువులు భావిస్తున్నారు.

గోదావరిలో మృతదేహం లభ్యం



చెందూర్ సునీల్(ఫైల్)

భైంసా: బాసర గోదావరి నదిలో సోమవారం చెందూర్ సునీల్(43) అనే వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గత రెండు రోజుల క్రితం బాసర వంతెనపై బైక్ వదిలి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం మృతదేహం లభించింది. మృతుడికి నిజామాబాద్‌లో సైకిళ్ల దుకాణం ఉంది.

లక్షణమైన మాస్టారు



అవార్డు స్వీకరిస్తున్న అరవింద్ (ఫైల్)

- సులభ పద్ధతిలో విద్యాబోధన
- సాంకేతికతను అందిపుచ్చుకుంటూ..
- విద్యార్థుల కోసమే యూట్యూబ్ ఛానల్
- లక్షకు పైగా సబ్‌స్క్రైబర్స్



నిర్మల్‌ఖిల్లా: ఆయనో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు.. విద్యార్థులకు సులభ పద్ధతిలో పాఠాలు బోధించనిదే తనకు సంతృప్తి ఉండదంటారు. అతనే నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన మైన అరవింద్. లక్ష్మణ చాంద మండలం వడ్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుని డిజిటల్ పాఠాలు, ప్రొజెక్టర్‌పై బోధనోపకరణాలతో విద్యాబోధన చేస్తున్నారు. విద్యార్థులు ఆసక్తిగా వింటున్నారు. ప్రతీ బోధనాంశాలను వీడియో తీస్తున్నారు. వారి కోసం అరవింద్ మైన వ్లాగ్స్ (Aravind mysa vlogs) పేరిట యూట్యూబ్ ఛానల్ ప్రారంభించి అప్‌లోడ్ చేస్తున్నారు. దేశ విదేశాల్లో విద్యార్థులు, వీక్షకులు చూసి లైక్‌లు టిక్ చేసి, కామెంట్లు పెడుతున్నారు.

1.న్యూటన్ గమన నియమ అనువర్తనం
2. టిండాల్ ప్రభావం
3. పదిపరీక్షలను ఎదుర్కోవడం ఎలా

అత్యధిక వీక్షణలు సొంతం చేసుకున్న వీడియోలు

4. ప్రభుత్వ బడుల్లో దీటైన బోధన
5. గాలి పీడనం ప్రయోగపూర్వక వివరణ
6.కాంతి వక్రీభవనం గురించి..

లక్షకు పైగా సబ్‌స్క్రైబర్స్

పదో తరగతి విద్యార్థులకు సలహాలు సూచనలు, ఉన్నత విద్యాభ్యాసం, భవిష్యత్ మార్గసూచి, కెరీర్ గైడెన్స్, సమాజంలోని వివిధ వృత్తులు వ్యవసాయ, అనుబంధ రంగాలు తదితర అంశాలపై వీడియో తీసి 'అరవింద్ మైన వ్లాగ్స్'కు అప్‌లోడ్ చేస్తున్నారు. వీటిని కోటికిపైగా వీక్షించారు. ఇతరులకు షేర్ చేస్తూ ఉంటారు. ఇప్పటికే 'లక్ష'కుపై సబ్‌స్క్రైబర్లుగా ఉండడం విశేషం.

వీడియోలకు క్రేజ్

ఇప్పటికే డీఈవో, జిల్లా కలెక్టర్, సబ్జెక్టు నిపుణులతో తన వీడియోలో పరిచయ కార్యక్రమాలు, సందేశాలను ఇవ్వడంతో అరవింద్ వీడియోలకు క్రేజ్ పెరిగింది. ఇతర దేశాల నుంచి వీక్షకులు ఉన్నారు. ఇప్పటికే ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు, సన్మానాలు, ప్రశంసపత్రాలు అందుకున్నారు.

వినూత్న బోధన చేస్తున్నా



సాంకేతికతను వినియోగించుకుని విద్యార్థులకు సులభ పద్ధతిలో పాఠాలు బోధిస్తున్నా. వినూత్న బోధనతోపాటు, వీడియోలు చేసి తన యూట్యూబ్ చానల్‌లో అప్‌లోడ్ చేశా. 8 నెలల్లో లక్షకుపైగా సబ్‌స్క్రైబర్లు, ఒక్కో వీడియోకు 50 లక్షలపైగా వీక్షకులు చూడడం ఆనందంగా ఉంది. దేశ, విదేశాల్లో తన యూట్యూబ్ చానల్‌కు ఫాలోవర్స్ ఉన్నారు.

– మైన అరవింద్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, నిర్మల్



లక్ష దాటిన యూట్యూబ్ చానల్ సబ్‌స్క్రైబర్స్

పాముకాటుకు చిన్నారి మృతి



నిత్య మృతదేహం



నిత్య(ఫైల్)

భైంసారూరల్: పాము కాటుకు చిన్నారి మృతి చెందింది. మండలంలోని హంపోలి గ్రామంలో సోమవారం వేకువజాము ఈ ఘటన చోటుచేసుకుంది. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాలు.. బాసింద్ల రజిత–సాయినాథ్ దంపతులకు కూతురు నిత్య(7), రెండేళ్ల వయస్సు గల కుమారుడు ఉన్నారు. రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి కుటుంబీకులు భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. రాత్రి 2 గంటల ప్రాంతంలో నిత్య కాలికి ఏదో కరిచిందని ఏడ్చింది. వెంటనే తండ్రి ఆమె కాలిని పరిశీలించగా రక్తం రావడాన్ని గమనించాడు. వెంటనే దుప్పటి తీయగా బయటకువచ్చిన పామును చంపేశాడు. నిత్యను భైంసాలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది.

వేర్వేరు కేసుల్లో ముగ్గురి రిమాండ్

భైంసాటౌన్: వేర్వేరు ఘటనలకు సంబంధించి కేసుల్లో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పట్టణ సీఐ ఎల్. శ్రీను తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. ఈనెల 5న పట్టణంలోని గోపాల్‌నగర్‌కు చెందిన రాచర్ల శ్యాంపై గుర్తు తెలియని దుండగులు దాడి చేశారన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. అతని భార్య రాచర్ల కరుణ, అత్త గైక్వాడ్ ఇంద్రబాయి దాడి చేసినట్లు నిర్ధారించినట్లు తెలిపారు. ఈ మేరకు ఇరువురిని రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే 19న గోపాల్‌నగర్‌కే చెందిన తోట శంకర్‌పై హత్యాయత్నం చేసిన ఘటనలో కాంతం నరేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆస్పత్రిపై దాడి ఘటనలో ఆరునెలల జైలు

భైంసాటౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిపై దాడి చేసిన ఘటనలో 17 మందికి ఆరునెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ పీఆర్ఎల్ నిర్మల్ జిల్లా సెషన్స్ జడ్జి ఎ.కర్ణకుమార్ తీర్పు ఇచ్చినట్లు పట్టణ సీఐ ఎల్.శ్రీను ఓ ప్రకటనలో తెలిపారు. 2009లో జరిగిన ఘటనకు సంబంధించి విచారణ అనంతరం నిందితులకు జైలుశిక్ష విధిస్తూ సోమవారం జడ్జి తీర్పు వెలువరించారని సీఐ పేర్కొన్నారు.

గుట్టలెక్కి వైద్యం..



కాలినడకన వెళ్తున్న వైద్యసిబ్బంది

ఇచ్చోడ: మండలంలోని బావోజిపేట్ గ్రామంలో ర్యాపిడ్ ఫీవర్ సర్వేతోపాటు గర్భిణుల చికిత్స కోసం నర్సాపూర్ వైద్యసిబ్బంది సోమవారం కాలినడకన గుట్టలు ఎక్కారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బావోజిపేట్‌కు బైక్‌లపై వెళ్లలేని పరిస్థితి. వైద్య సిబ్బంది రాథోడ్ కృష్ణ, రేణుక కాలినడకన వెళ్లి గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చారు. మండలంలో చాలా గ్రామాలకు సరైన రోడ్ల సౌకర్యాలు లేకపోవడంతో సర్కారు వైద్యం అందని పరిస్థితి ఉంది.

ముందస్తు చర్యలతో ఫైలేరియాకు చెక్



మాట్లాడుతున్న తుకారం

నిర్మల్‌చైన్‌గేట్: ముందస్తు చర్యలతో ఫైలేరియాను అరికట్టవచ్చని రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ తుకారం అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో 'మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్'పై సోమవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైలేరియా లక్షణాలు, వ్యాధిబారిన పడితే తలెత్తే అనారోగ్య సమస్యలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. మాస్ అడ్మినిస్ట్రేషన్‌లో భాగంగా ఐవర్ మెక్టిన్, ఆల్బెండజోల్ డీఈసీ మాత్రలను తీసుకునేలా ప్రజలను చైతన్య పర్చాలన్నారు. డీఎంహెచ్‌వో ధనరాజ్ మాట్లాడుతూ మైక్రోఫైలేరియా ఎక్కువ శాతం మందిలో ఉంటుందన్నారు. 10–15 ఏళ్ల వరకు వ్యాధి లక్షణాలు బయటకు కనిపించవని అన్నారు. మాత్రలు ఇప్పుడు తీసుకోక, వ్యాధి బారినపడితే చికిత్స అందుబాటులో లేదన్నారు. బోధకాల వ్యాధి నివారణకు ఆగస్టు 10 నుంచి బూత్ యాక్టివిటీస్, ఇళ్ల సందర్శన, మాప్ అప్ ద్వారా నిర్వహిస్తామన్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ ఎజిల్ హర్సన్, కార్యక్రమం నిర్వహణ అధికారి డాక్టర్ రాజారమేశ్, వైద్యాధికారులు ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఒకరి ఆత్మహత్య

తలమడుగు: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఏఎస్సై సురేందర్ కథనం ప్రకారం..మండలంలోని కుచులాపూర్‌కు చెందిన గోల్లాల రాములు (36), భార్య సవిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాములు వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం పొలంలో పిచికారీ చేసేందుకు వెళ్లాడు. పిచికారీ తర్వాత మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళన



నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ ఉద్యోగులు

కైలాస్‌నగర్: తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ సమావేశ మందిరం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ, కనీస వేతనం చెల్లించడంతో పాటు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే జోగు రామన్నకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఇందులో ఎస్ఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు అనురాధ, దీప్తి, ప్రశాంత్‌రెడ్డి, ప్రకాశ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్లు అందజేసి నిరసన..



తహసీల్దార్‌కు హెల్మెట్ అందిస్తున్న సభ్యులు

బోథ్: తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో పైకప్పు కూలితే సిబ్బంది రక్షణగా ఉండేందుకు బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు సోమవారం హెల్మెట్లు పంపిణీ చేసి వినూత్న నిరసన తెలిపారు. తహసీల్దార్ అతికొద్దిన్‌కు వీటిని అందజేశారు. పైకప్పు కూలితే రక్షణ కోసం హెల్మెట్లు అందజేసినట్లు సభ్యులు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని రూ.5 కోట్లు కేటాయించి నిర్మించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ స్తంభం ఎక్కి యువకుడి హల్‌చల్



విద్యుత్ తీగలు పట్టుకున్న ప్రవీణ్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీలో ఓ యువకుడు మద్యం మత్తులో విద్యుత్ స్తంభం ఎక్కి హల్‌చల్ చేశాడు. కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్న ప్రవీణ్ ఇంటి గొడవల కారణంగా సోమవారం స్తంభం ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. విద్యుత్ తీగలను పట్టుకుంటానని అనడంతో స్థానికులు సరఫరా నిలిపివేయించారు. ఎంత నచ్చజెప్పినా దిగిరాక తీగలు పట్టుకుని వేలాడారు. ఆ తర్వాత స్తంభం నుంచి జారి కిందపడగా స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సదరు యువకుడిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

పాఠ్యపుస్తకాల సీజ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఏబీవీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఆదిలాబాద్ ఎంఈవో జయశీల పాఠశాలలో సోమవారం తనిఖీ చేశారు. పుస్తకాలు నిల్వ ఉన్న గదిని సీజ్ చేశారు. ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాంలు, షూలు తదితర వస్తువులను విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ అక్షయ్, అఖిలేష్, సంజయ్, నిలేష్ తదితరులు ఉన్నారు.

మిస్సింగ్ కేసు

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన వివాహిత దండ్ల లక్ష్మి (42) మతిస్థిమితం సరిగా లేక ఈనెల 3 నుంచి కనిపించడం లేదు. ఎక్కడ ఆచూకీ దొరకకపోవడంతో ఆమె భర్త హన్మండ్లు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.రవీందర్ తెలిపారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



అర్జీలు స్వీకరిస్తున్న చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యలు త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను శాఖల వారీగా పరిశీలించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో కనక భీంరావు, ఏడీఎంఅండ్‌హెచ్‌వో కుడ్మ బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

- కిరాణ దుకాణం ఏర్పాటుకు ఆర్థికసాయం మంజూరు చేయాలని కెరమెరి మండలం చందుగూడకు చెందిన జె.రవికుమార్ విన్నవించాడు.
- తనకు అటవీ హక్కు పత్రం ఇప్పించాలని బజార్‌హత్నూర్ మండలం మడగూడ గ్రామానికి చెందిన తుర్పబాయి కోరింది.
- బోథ్ మండలం పార్డి గ్రామానికి చెందిన మెస్రం నిరుపమా ల్యాప్‌టాప్ మంజూరు చేయాలని అర్జీ అందించారు.
- నార్నూర్ మండలం గుండాల గ్రామానికి చెందిన రాథోడ్ ఉష ఏఎన్ఎం ఉద్యోగం ఇప్పించాలని విన్నవించింది.
- తనకు స్వయం ఉపాధి కల్పించాలని ఉట్నూర్ మండలం సాకెర గ్రామానికి చెందిన ఆర్.జైస్వాల్ అర్జీ పెట్టుకుంది.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్



స్టాకు నిల్వలపై ఆరా తీస్తున్న దిలీప్‌కుమార్

బేల: విధి నిర్వహణలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలలను సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. స్టాకు నిల్వలు, వంట గది, నీళ్ల, తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. సమస్యలపై రోడ్డెక్కుతున్న విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీళ్ల సమస్య లేకుండా పైప్‌లైన్ మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని వార్డెన్‌ను ఆదేశించారు. వార్డెన్ అందుబాటులో లేనప్పుడు, సెలవులో ఉన్నప్పుడు ఉపాధ్యాయుడికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని హెచ్ఎంకు సూచించారు. విద్యార్థుల వైద్య, ఆరోగ్యం పట్ల రెండు, మూడు రోజుల్లో ఒక్కో ఆశ్రమ పాఠశాలలో ఒక్కో ఏఎన్ఎంను నియమిస్తామన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం, రోడ్డెక్కడం పునరావృతమైతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా విద్యార్థులతో దురుసుగా మాట్లాడుతున్న వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు ఆడ శంకర్, పెందుర్ రాందాస్, సిడాం నందకుమార్‌లు డిప్యూటీ డైరెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

రైతులు అధైర్యపడొద్దు



పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్

బేల: భారీ వర్షాల నేపథ్యంలో రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే జోగు రామన్న పేర్కొన్నారు. మండలంలోని సాంగిడి, బెదోడ, కాంఘర్‌పూర్, గూడ, మణియార్‌పూర్, కొగ్దూర్, మాంగ్రుడ్ రెవెన్యూ గ్రామాల శివారులో పెన్‌గంగ బ్యాక్‌వాటర్‌తో నీట మునిగి దెబ్బతిన్న పంటలను సోమవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి, పంటనష్టంపై ఆరా తీశారు. నియోజకవర్గంలో దాదాపు 20 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నామని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు రమేశ్, తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎంపీడీవో మహేందర్‌కుమార్ ఉన్నారు.

తాంసి: ముంపు రైతులకు పరిహారం అందేలా చూస్తానని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ తెలిపారు. పెన్‌గంగ వరద ప్రవాహానికి అర్లి(టి)లో ముంపునకు గురై దెబ్బతిన్న పంటలు, ఇళ్లను డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి పరిశీలించారు. 3500 ఎకరాల పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్, వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. మంత్రి కేటీఆర్ జన్మదినం పురస్కరించుకుని గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. జెడ్పీటీసీ సుధాకర్, సర్పంచ్ రమ లస్మన్న, ఏవో రవీందర్, తహసీల్దార్ మహేంద్రనాథ్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అనిల్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు లింబాజీ ఉన్నారు.

టేకు కలప దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్

ముధోల్: టేకు కలపను దొంగలించిన నిందితులను అరెస్టు చేసినట్లు భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ తెలిపారు. ముధోల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఏఎస్పీ వివరాలు వెల్లడించారు. గత నెలలో 26న ముధోల్‌లో రైతు మధుకర్ టేకు చెట్లు పెంచుతున్నాడు. ఈ క్రమంలో కొందరు టేకు చెట్లను దొంగలించారు. దీంతో రైతు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. గత శుక్రవారం రాత్రి మరోసారి టేకు చెట్లను నరికి తీసుకెళ్తున్న ముగ్గురు దొంగలను పట్టుకుని రూ.2లక్షల విలువ గల టేకు దుంగలు, బొలెరో వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన షేక్‌గౌస్, ఫిరోజ్‌ఖాన్, షేక్ సాజీద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మరో నలుగురు జావేద్, అఫ్రోజ్, మహబూబ్, బాషిత్‌లు పరారీలో ఉన్నారని తెలిపారు. దొంగలను పట్టుకున్న స్థానిక సీఐతో పాటు ఎస్సై సిబ్బందిని అభినందించారు. సమావేశంలో సీఐ వినోద్‌రెడ్డి, ఎస్సైలు సాయికిరణ్, మోహన్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించకపోతే ఎన్నికలు బహిష్కరిస్తాం

- ఐటీడీఏ పీవోకు కుండి షెకుగూడ గ్రామస్తుల వినతి



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

నార్నూర్: గాదిగూడ మండలంలోని కుండి షెకుగూడకు రోడ్డు సౌకర్యం కల్పించకుంటే వచ్చే ఎన్నికలను బహిష్కరిస్తామని గ్రామస్తులు తేల్చిచెప్పారు. ఉట్నూర్‌లోని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌ను ఆమె కార్యాలయంలో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ గిరిజనులు మాట్లాడుతూ గ్రామంతోపాటు కొలాంగూడ, మారోతి గూడ, చిన్నకుండిలకు రోడ్డు మార్గం లేదన్నారు. వర్షాకాలంలో పరిస్థితి దారుణంగా ఉంటుందన్నారు. ఆస్పత్రికి వెళ్లాలంటే వాగులు, చిన్న చిన్న కాలువలు దాటాల్సి వస్తోందన్నారు. గ్రామ సమస్యలు పరిష్కరించాలని గతంలో 70 కి.మీ కాలినడకన కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని 9 రోజులు ఆందోళన చేపట్టినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పటేల్, యూత్ నాయకులు పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే దంపతులకు భారతరత్న ప్రకటించాలి

ఆదిలాబాద్‌రూరల్: దేశంలో సామాజిక న్యాయం, స్త్రీవిద్య కోసం అహర్నిశలు కృషి చేసిన మహాత్మా జ్యోతిబాపూలే దంపతులకు కేంద్రం భారతరత్న ప్రకటించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు సమావేశాల్లో పూలే దంపతులకు భారతరత్న ప్రకటించి గౌరవించాలని కోరారు. అదేవిధంగా పార్టీలకతీతంగా కేంద్రం మాట్లాడి తెలంగాణ మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే, మాలీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అంబేకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ ప్రధాన్, ఉత్తం పేట్కులే, అనిల్ కోట్రంగే, రామ్‌కిషన్ శేండే పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

నిర్మల్‌రూరల్: భర్త వేధింపులకు తాళలేక వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. రూరల్ ఎస్సై చంద్రమోహన్ కథనం ప్రకారం.. నర్సాపూర్(జి) మండల కేంద్రానికి మోగిలేజి సంధ్య(35)తో, నిర్మల్ రూరల్ మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన అరవింద్‌కు పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. అరవింద్ తాగుడుకు బానిసై ఆరేళ్లుగా జులాయిగా తిరుగుతుండేవాడు. కుటుంబ పోషణ కోసం సంధ్య జిల్లా కేంద్రంలోని ఓ క్లాత్ ఎంపోరియంలో పనిచేసేది. అరవింద్ తాగుడుకు బానిసై డబ్బులు కావాలంటూ సంధ్యను తరచూ వేధించసాగాడు. మానసికంగా, శారీరకంగా హింసించేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తాగడానికి డబ్బులు ఇవ్వకపోవడంతో ఆమెతో గొడవపడ్డాడు. మనస్తాపంతో సంధ్య సోమవారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదుతో భర్త అరవింద్, అత్త లక్ష్మిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.